ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5

జిల్లా వార్తలు

మంగళవారం 16 జూలై 2024

వానాకాలం పంటలు కళకళలాడుతున్నాయి. రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. పచ్చబడిన పంటలను చూసి రైతులు మురిసిపోతున్నారు. ఆమనగల్లు మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలు వానాకాలం పంటలకు జీవం పోశాయి. జొన్న, మొక్కజొన్న, పత్తి, ఆముదం పంటలు ఏపుగా పెరిగాయి. వరి సాగు కూడా ఈ ఏడాది బోరుబావుల కింద పెద్ద ఎత్తున రైతులు సాగు చేశారు. ఇటీవల వేసిన వరినాట్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

- ఆమనగల్లు, జూలై 15

పచ్చని పైరు..



ఆమనగల్లు మండలం సంకటోనిపల్లిలో కళకళలాడుతున్న జొన్న పంట




ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో వరిచేను



ఆమనగల్లు మండలం మేడిగడ్డలో పత్తి చేను



శంకర్‌పల్లి మున్సిపాలిటీ గణేష్‌నగర్ కాలనీలో మురికి గుంతలా మారిన డ్రైనేజీ నీరు



మున్సిపాలిటీల్లో పారిశుధ్యం పడకేసింది. చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు ఉప్పొంగుతున్నాయి. చెత్తను ఎక్కడ పడితే అక్కడ డంపు చేస్తున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయక చెత్తా చెదారం పేరుకు పోవడంతో పాటు కాల్వలు ప్లాస్టిక్ కవర్లు, చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. తడి, పొడి చెత్త వేరు చేయకుండానే డంప్ చేస్తున్నారు. దీంతో కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఈగలు, దోమల బెడద ఎక్కువైంది. దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలు పనిచేయడం లేదు. దోమకాటుతో జనం మంచాన పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా వంటి వ్యాధులతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకూ తీవ్రంగా పెరిగిపోతోంది.



మురికిపాలిటీలు!

మున్సిపాలిటీల్లో పడకేసిన పారిశుధ్యం

- విజృంభిస్తున్న వ్యాధులు, ఆందోళనలో జనం
- కానరాని కంపోస్టు ఎరువు తయారీ.. నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు
- పనిచేయని ఫాగింగ్ యంత్రాలు.. పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 15 : జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చేసినా చెత్తా చెదారమే. వాటిలో దోమలు నివాసాలు ఏర్పర్చుకొని జనంపై దాడి చేస్తున్నాయి. వాటి బారిన పడిన జనం జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వర పీడితుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నాయి. అయినా, పాలకులు, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని జనం విమర్శిస్తున్నారు. జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. అందులో అత్యధిక మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీల నిర్మాణం సక్రమంగా లేక వర్షాలకు డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీనికితోడు వాటిని శుభ్రయం చేయక పోవడంతో పూర్తిగా నిండి మురుగునీరంతా రోడ్లు, ఇళ్లలోకి చేరుతోంది. చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ నీరు రోడ్లపై పరుగులు పెడుతుండటంతో కాలనీలు కంపు కొడుతున్నాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని గణేష్‌నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరంతా ఓపెన్ ప్లాట్స్‌లోకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద తప్పడం లేదు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో పందుల బెడద ఎక్కువైంది. వర్షం కురిస్తే చాలు డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపై పొంగి పొర్లుతోంది. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో పారిశుధ్యం లోపించింది. పందులు ఇళ్ల మధ్యలో సంచరిస్తున్నాయి. అధికారులకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. షాద్‌నగర్ మున్సిపాలిటీలో సోలిపూర్ వద్ద చెత్తను డంపు చేస్తున్నారు. దీంతో దోమల బాధ ఎక్కువైంది. చటాన్‌పల్లి రైల్వేగేట్ సమీపంలో మురుగునీరు ఒక చోటకు చేరి దుర్గంధం వెదజల్లుతోంది.

దోమలు, ఈగల బెడద..

చెత్త డంప్ చేస్తున్న పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో డంప్ చేస్తున్న చెత్తను తీసేవారు లేక అది కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచిస్తున్న అధికారులు ఆ దిశగా మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. తడి, పొడి చెత్తనంతా సేకరించి శివారు ప్రాంతాలకు తరలించి డంప్ చేస్తున్నారు.

పనిచేయని ఫాగింగ్ యంత్రాలు..

మున్సిపాలిటీల్లో దోమల నివారణకు కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు పనిచేయడం లేవు. ప్రధానంగా వర్షాకాలంలో కాలనీలు తిరిగి దోమలను అరికట్టేందుకు ఉపయోగపడే ఈ యంత్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలకు అనవరమైన నిధులు కేటాయించక పోవడంతో సమస్య జటిలమవుతోంది. ఏటా బడ్జెట్ సమావేశాల సందర్భంగా పారిశుధ్యానికి నిధులు కేటాయిస్తున్నా తర్వాత వాటిని ఇతర పనులకు వినియోగిస్తున్నారు. పారిశుధ్య కార్యక్రమాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దోమల బెడద తీవ్రం కావడంతో అధిక సంఖ్యలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఫాగింగ్ యంత్రాలు వినియోగించాలంటే గంటకు రూ.వేయి వరకు వెచ్చించాల్సి వస్తుందంటున్నారు.



షాద్‌నగర్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో పేరుకు పోయిన చెత్త



శంకర్‌పల్లి మున్సిపాలిటీలో చెత్తతో నిండిన మురుగు కాలువ

విజృంభిస్తున్న వ్యాధులు

సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రతీ ఇంటికి ఒకరు చొప్పున వ్యాధుల బారిన పడుతున్నారు. వీటికి తోడు మలేరియా, డెంగీ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధుల లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకు గణనీయంగా పెరుగుతోంది. వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ మున్సిపాలిటీల్లో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 55 డెంగీ కేసులు నమోదయ్యాయి. జీహెచ్‌ఎంసీ ప్రాంతాల్లో ఈ పరిస్థితి డేంజర్‌గా మారింది. ఇప్పటి వరకు నమోదైన డెంగీ కేసుల్లో జీహెచ్‌ఎంసీలో 39, మున్సిపాలిటీల్లో 11, గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు ఉన్నాయి. అనధికారికంగా లెక్కలోకి రాకుండా ఉన్న కేసుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందక పోవడంతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు.



ఇబ్రహీంపట్నంలో యథేచ్ఛగా తిరుగుతున్న పందులు

మూన్నాళ్ల ముచ్చటగా కంపోస్టు తయారీ

లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని చాలా కాలనీల్లో దుర్గంధం పేరుకుపోతోంది. నివాసాల మధ్య మురుగు పారుతుండటంతో పందులు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. రూ. కోట్లలో నిధులు చేస్తున్నామని చెబుతున్నా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిన దాఖలాలే లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- 120 విజ్ఞప్తులను స్వీకరించిన కలెక్టర్ శశాంక



ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూలై 15 : ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజలు వివిధ సమస్యలతో బారులు దీరారు. ప్రజల నుంచి కలెక్టర్ శశాంక 120 విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వీలైనంత త్వరగా పరిష్కంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరిండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ శశాంక అన్నారు. ప్రజావాణి కార్యక్రమ అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమాశంలో ఆయన మాట్లాడారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ప్రతీ క్యాడర్‌లో 40శాతానికి మించకుండా బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వద్దు
- ఏఐటీయూసీ డిమాండ్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు

రంగారెడ్డి అర్బన్, జూలై 15 : మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలోని మహేశ్వరం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్ హయత్‌నగర్, కొత్తూర్, నందిగామ, శంషాబాద్ మండలాలను అక్షయపాత్రకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారని తెలిపారు. ఈ నిర్ణయం అమలు జరిగితే 23 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం వంటలు చేస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతాయని తెలిపారు. అనేక నష్ట కష్టాలను భరించి మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేసే వారంతా బడుగు, బలహీన వర్గాలకు చెందినవారని, కార్మికుల పొట్ట కొట్టే నిర్ణయాన్ని అధికారులు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశాడు కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, నాయకుడు కె. చందు యాదవ్, మధ్యాహ్న భోజన కార్మికులు వి.మంజుల, ఎస్.సంతోష, ఎస్. అండాలు, ఆర్. రాములమ్మ, వై.పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి వెళ్తున్న జగన్నాథుడి రథయాత్ర


గుడికి చేరిన జగన్నాథుడు

- శోభాయమానంగా రథయాత్ర
- కళాకారుల ఆటపాటలు, భక్తుల నృత్యాలు

షాద్‌నగర్‌అర్బన్, జూలై 15: జగన్నాథుడి ఉత్సవంలో భాగంగా తొమ్మిది రోజుల క్రితం ఈశ్వర్‌కాలనీ ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చిన జన్నాథుడు సోమవారం సాయంత్రం తిరిగి ఆర్టీసీ కాలనీలోని జగన్నాథ ఆలయానికి చేరుకున్నాడు. జై జగన్నాథ స్వామి సేవా ట్రస్టు అధ్యక్షుడు పరుశురాందాస్ ఆధ్వర్యంలో ఈ నెల 6న జగన్నాథుడు, సుభద్ర, బలరాముడి రథాలు ఆర్టీసీ కాలనీ నుంచి ఈశ్వర్ కాలనీకి వచ్చిన విషయం విదితమే. జగన్నాథుడి భక్తులు తొమ్మిది రోజుల పాటు నిత్యపూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించి భక్తిని చాటుకున్నారు. చివరి రోజు సైతం హోమం, హారతిని నిర్వహించి, అన్నదానం చేశారు. భక్తిగీతాలను ఆలపించారు. యువకులు కర్రసాము చేస్తూ అలరించారు. పూజకు పట్టణ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలు తరలివచ్చారు. అనంతరం మూడు రథాలను ఊరేగింపుగా జగన్నాథుడి ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, కౌన్సిలర్లు ఈశ్వర్‌రాజు, ఈగ వెంకట్‌రాంరెడ్డి, కాలనీల ప్రముఖులు మేడిగ పెంటయ్య, ఎం. వెంకట్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఆర్వోబీ నిర్మాణానికి రూ. 190 కోట్లు మంజూరు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూలై 15: షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనడానికి వెళుతున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి షాద్‌నగర్ బైపాస్ చౌరస్తాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 90 కోట్లు మంజూరు చేసిందని, అయితే, ఇప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి మేరకు రూ. 190 కోట్లు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. మరో 15 రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే రూ.5వేల కోట్లతో హైదరాబాద్- కర్నూల్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలు చేపట్టారని, అలాగే మంత్రులు కూడా నియోజకవర్గ పర్యటనలు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, రోడ్లు, ప్రభుత్వ భవనాల మరమ్మత్తులు, ఆధునీకరణ కోసం అడిగిన వెంటనే నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవాబుపేట, జూలై 15: ఎల్లకొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల భరత్‌రెడ్డి తల్లి నిర్మల సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బెల్ట్‌షాపులు తొలగించాలి

● పొన్నాల్‌లో మహిళల ఆందోళన


పొన్నాల్ గ్రామంలో మద్యం బెల్ట్‌షాపులను తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలు

శామీర్‌పేట, జూలై 15: పొన్నాల్ గ్రామంలో అక్రమార్కులు మద్యం బెల్ట్‌షాపులను విచ్చలవిడిగా నడుపుతున్నారని సోమవారం మహిళలు ఆందోళనకు దిగారు. ఆ గ్రామంలో కొందరు అక్రమార్కులు దాదాపు 11మద్యం బెల్ట్‌షాపులను దర్జాగా ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12గంటల వరకు విచ్చలవిడిగా నడుపుతున్నారని మహిళలు ఆరోపించారు. తమ గ్రామంలో ఏళ్ల తరబడి అక్రమార్కులు మద్యం బెల్ట్ షాపులను సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకున్న పాపాన పోవడం లేదని మహిళలు విచారం వ్యక్తంచేస్తున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం సేవించిన మందుబాబులు బాటిళ్లను విచ్చలవిడిగా రోడ్లపై, ఇళ్లపై వేస్తున్నారని, ఇళ్ల ముందు మూత్ర విసర్జన చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామంలోని మద్యం బెల్ట్‌షాపులను పూర్తిగా నివారించకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి


ఎదులాబాద్‌లో పర్యటించి సమస్యలను అడిగితెలుసుకుంటున్న డీఎల్‌పీవో సాంబిరెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో సాంబిరెడ్డి కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం ఎదులాబాద్‌లోని దళితవాడలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగేశ్వర్‌రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యునికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: విద్యార్థులు కమ్యునికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో కమ్యునికేషన్ స్కిల్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీ ఉట్ల మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన ఉన్న భయాన్ని పోగొట్టడానికి కమ్యునికేషన్ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు మూర్తి, ఎంఎం రావు, శాస్త్రి, సంపత్, వేణుగోపాల్, హెచ్‌వోడీ విష్ణుచందన, మాధవి, నరేందర్ పాల్గొన్నారు.

పోస్టాఫీసుకు సొంత భవనం నిర్మించాలి


ఎంపీ ఈటలను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

మేడ్చల్ టౌన్, జూలై 15: మల్కాజ్‌గిరి పోస్టాఫీసుకు సొంత భవనాన్ని నిర్మించాలని కోరుతూ తపాల శాఖ యూనియన్ నాయకులు సోమవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మండలంలోని పూడూరు గ్రామ శివార్లలోని ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో తపాలా శాఖ ఉద్యోగులు కలిశారు. మల్కాజ్‌గిరి పోస్టాఫీసుకు సొంత భవనం లేని కారణంగా అద్దె చెల్లిస్తూ ప్రైవేట్ భవనాల్లో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తరుచూ అద్దె భవనాలు మారడంతో తమ విధులకు ఇబ్బందులు కలగటంతో పాటు ప్రజలకు సేవలందిచలేకపోతున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తరపున తమకు సొంత భవనం సమకూర్చాలని పోస్టాఫీసు ఉద్యోగులు కోరారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సొంత భవనం కోసం స్థలం కేటాయించే విధంగా కృషిచేస్తానని ఈటల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగ సంఘం నేతలు, మల్కాజ్‌గిరి పోస్టాఫీసు ఉద్యోగులు పాల్గొన్నారు.

'డబుల్' బెడ్‌రూం ఇళ్లు పది శాతం స్థానికులకే కేటాయించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, జూలై 15: డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో 50శాతం స్థానికులకే కేటాయించాలని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ లో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధి రాంపల్లి పరిధి రెవన్యూ సర్వే నంబర్ 258లోని 52ఎకరాలు వివిధ కుల వృత్తిదారులకు సంబంధించిన స్థలాన్ని సేకరించి, గతప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లనిర్మాణాలు చేపట్టిందన్నారు. శంకుస్థాపన సమయంలో స్థానికులకు పదిశాతం ఇళ్లను కేటాయిస్తామని, నాటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఆయన హామీని విస్మరించి ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కేటాయించారన్నారు. దీన్ని సవాలు చేస్తూ న్యాయస్థానాన్నీ ఆశ్రయించామని, కేటాయింపును రద్దు చేస్తూ స్థానికులకూ కేటాయించాలని ధర్మాసనం సూచించిందన్నారు. దీని ప్రకారం స్థానికులకు ఇళ్ల కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

సీఎంతో ఎమ్మెల్యే భేటీ


సీఎంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 15: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాండూరు ప్రాంత అభివృద్ధి, తాండూరు కొడంగల్ అనుసంధాన రోడ్ల విషయమై చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సీఎంను కలవడం ఈ వారంలో రెండోసారి.

మేడ్చల్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్

మేడ్చల్ టౌన్, జూలై 15: గురుపౌర్ణమిని సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్ సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు డిపో అధికారులు తెలిపారు. ఈనెల 19వ తేదీన సాయంత్రం 7గంటలకు మేడ్చల్ బస్ డిపో నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రతీ ప్రయాణికుడు రూ.3900 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్యాకేజీలో భోజన వసతి కూడా ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆసక్తిగల భక్తులు అడ్వాన్స్‌గా టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు. టూర్ ప్యాకేజీకి సంబంధించి అదనపు వివరాలకు డిపో అధికారులను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.


ఆర్డీవో సాయిరాంకు వినతిప్రతం ఇస్తున్న నాయకులు

అంతారంలో మైనింగ్‌కు అనుమతివ్వొద్దు

చేవెళ్ల, జూలై 15 : మండల పరిధిలోని అంతారంలో నిర్వహిస్తున్న మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, మరోసారి దీన్ని రెన్యూవల్ చేయొద్దని కోరుతూ అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు చేవెళ్ల ఆర్డీవో సాయిరాంకు సోమవారం వినతపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేందర్ మాట్లాడుతూ.. వంద ఎకరాల్లో గుట్టను ఇప్పటికే నేలమట్టం చేశారన్నారు. ఖనిజం కోసం లోతు ఎక్కువగా తవ్వడంతో చెత్త, మురుగు నీరు నేల ఇంకి భూమి పొర కలుషితం అవుతుందన్నారు. గ్రామస్తుల క్షేమం, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు శ్రీకాంత్, రాజేశ్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అక్బర్

మెదడు వాపు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించాలి

చేవెళ్ల, జూలై 15: మెదడు వాపు వ్యాధి నివారణకు 9 నెలల నుంచి 15ఏళ్ల వయసున్న పిల్లలందరికీ దశల వారీగా వ్యాక్సిన్ వేస్తామని ఆలూర్ మెడికల్ అధికారి రాఘబాబు, చేవెళ్ల ఎంఈవో అక్బర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్‌లో జేఈ వ్యాక్సిన్‌పై హెచ్ఎంలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మెదడు వాపు నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పిల్లలకు వ్యాక్సీ వేయనుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఈ నెల 25 నుంచి ఆగస్టు 15లోపు వ్యాక్సీన్ వేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థికి జేఈ వ్యాక్సిన్ రెండుసార్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

'కస్తూర్బా'లో సమస్యల పరిష్కారానికి కృషి

షాద్‌నగర్ రూరల్ జులై 15: కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద కస్తూర్బా పాఠశాలను సోమవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ అరుణ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. విద్యుత్ సమస్య ఉందని, 500మంది బాలికలు ఉన్నారని, వారికి డైనింగ్ సరిపోవడం లేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఆయన మాట్లాడుతూ.. తాను సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలపై ఎమ్మెల్సీకి ప్రిన్సిపాల్ వినతిపత్రం ఇచ్చారు. వారితో ఎంఈఓ శంకర్ రాథోడ్ ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూలై 15: చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎంను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కలిశారు. ప్రజాపనుల కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

25 నుంచి పిల్లలకు జీఈ టీకా


మాట్లాడుతున్న పల్వాన్ కుమార్

వికారాబాద్, జూలై 15: 6 నుంచి 15 సంవత్సరాల పిల్లలకు జీఈ టీకాలు వేయపేపకపటేకల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ తెలిపారు. జిల్లాలోని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి సోమవారం మెదడు వాపు వ్యాధి నివారణ జీఈ టీకా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ టీకా వేయనున్నట్లు తెలిపారు. జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈనెల 25న జిల్లాలో ప్రారంభించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ మురారి, జేఈ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత గురించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, 22 పీహెచ్‌సీల పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

వికారాబాద్, జూలై 15: 2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు కోరారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో డీఎడ్ 2007, 2009, ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు 2008, డీఎస్సీలో వెలువడిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరినట్లు గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం తప్పిదం వల్ల ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు కానీ ప్రైవేటు డీఎడ్ అభ్యర్థులకు 2008, డీఎస్సీలో అవకాశం ఇవ్వలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, కిశోర్, జగన్నాథ్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని కలిసి సమస్యను వివరిస్తున్న 2008 డీఎస్సీ అభ్యర్థులు

వైభవంగా రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ

కీసర, జూలై 15: శ్రీ రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. నిత్య సేవల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, భక్తజనసందోహం స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీసేవల్లో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈమేరకు భక్తుల కోలహలంతో, శివనామస్మరణతో సోమవారం మార్మోగింది.


కనుల పండువగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ

మహిళల గోరింటాకు సంబరాలు

షాబాద్, జూలై 15: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా మహిళలు ఆషాఢంలో గోరింటాకు సంబరాలు జరుకుంటున్నారు. సోమవారం మండలంలోని తాళ్లపల్లిలో సంధ్య పొదుపు సంఘం మహిళలు గోరింటాకు దిద్దుకున్నారు. రంగవల్లులతో, ఆటపాటలతో ఉల్లాసంగా గోరింటాకు పండుగను జరుపుకున్నారు. మహిళా సంఘం అధ్యక్షురాలు ఉమారాణి మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు శుభప్రదమని, ఔషధ గుణాలున్న గోరింట ఆరోగ్యానికీ మంచిదన్నారు. కార్యక్రమంలో పార్వతమ్మ, మంజుల, భావన, స్వరూప, మధున తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

స్పీకర్ ఇంటి ఎదుట అంగన్‌వాడీల ధర్నా

వికారాబాద్, జూలై 15: తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు సోమవారం అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్ ఇంటిని ముట్టడించి నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.భారతి, మనోహర లక్ష్మిలు మాట్లాడుతూ.. 45 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఆయనకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలని, జీవితంలో సగం పించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు రేవంత్‌రెడ్డి సీఎం తక్షణమే అమలు చేయాలన్నారు. అసెంబ్లీ స్పీకర్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా వాసులే అయినందున కనీస వితనాల జీవో, పించన్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో విడుదల చేసి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నిరసన కారులను అడ్డుకున్న పోలీసులు

పరిగి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం అంగన్‌వాడీ టీచర్లు పరిగిలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడికి యత్నించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు బహార్‌పేట్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. అప్పటికే పరిగి సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఎమ్మెల్యే ఇంటి గేట్‌ను మూసి తాళం వేశారు. వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.నర్సమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు నరేష్, నాయకురాళ్లు మంజుల, స్వరూప, నిర్మల, పార్వతమ్మ, పుల్లమ్మ, సంతోష, మల్లమ్మ, శ్వేత, కమల, దేవిలు పాల్గొన్నారు.


పరిగి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చిన అంగన్‌వాడీలు


స్పీకర్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి

తాండూరు: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నెంబర్ 10ను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప, అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్టు కార్యదర్శి భాగ్యలక్ష్మి, జయంతి, శశికళ, అరుణ, లలిత, కల్పన, సరస్వతి, సంధ్య, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ లక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 15: అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సోమవారం టీచర్ల, హెల్పర్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చి సమస్యలను చెప్పుకున్నారు. అంగన్‌వాడీలు చేసిన దీక్షలతో అప్పటి మంత్రులు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చార్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీల వేతనం 18వేలకు పెంచుతామని పేర్కొందన్నారు. వారికి రిటైర్మెంట్ బెన్ఫిట్స్, ఐదు శాతం ఐఆర్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు శ్రీను నాయక్, భేరి శ్రీనివాస్, కె.జయమ్మ, ఊర్మిళ, సంగీత, సుజాత, మమత పాల్గొన్నారు.

ఎగ్ బిర్యానీ అడిగితే.. పాచిపోయింది ఇచ్చారు

వికారాబాద్, జూలై 15: వేడివేడి ఎగ్ బిర్యానీ తినాలనుకుని హోటల్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని అనుభవం ఎదురైంది. ఆర్డర్ చేసిన ఎగ్ బిర్యానీ పాచిపోవడం చూసి కంగుతిన్నాడు. ఈ ఘటన సోమవారం వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. వికారాబాద్ బస్టాండ్ సమీపంలోని యాస్కి కాలనీకి చెందిన సంగప్ప ఎన్టీఆర్ చౌరస్తాలోని జీషాన్ హోటల్‌కు వెళ్లాడు. అక్కడ ఎగ్ బిర్యానీ పార్సిల్ ఆర్డర్‌చేసి బిల్లు కట్టాడు. హోటల్ సిబ్బంది ఇచ్చిన బిర్యానీ పార్సిల్ తీసుకొని ఇంటికి వెళ్లాడు. భోజనం చేసేందుకు సిద్ధమై పార్సిల్ విప్పగా దాంట్లో నుంచి ఒక్కసారిగా దుర్వాసన రావడంతో విస్తుపోయాడు. పాచిపోయిన వాసన ఉండటంతో ఆ పార్సిల్‌ను తిరిగి ప్యాక్‌చేసి ఆ హోటల్‌కు వెళ్లి ఇచ్చేశాడు. పాచిపోయిన బిర్యానీ ఎలా ఇస్తారంటూ ఆ హోటల్ సిబ్బందిని ప్రశ్నించాడు. అయితే ఈ విషయంలో జీషాన్ హోటల్ యాజమాన్యం వెనక్కి తగ్గకపోవడంతో సంగప్ప మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా అక్కడ ఎవరూ స్పందించలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకువెళ్లేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రజారోగ్య శాఖ అధికారులు స్పందించి తనకు పాచిపోయిన ఎగ్ బిర్యానీ ఇచ్చి మోసం చేసిన జీషాన్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని సంగప్ప కోరాడు.

ఆస్పత్రిలో శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమని కుటుంబీకుల ఆందోళన

తాండూరు, జూలై 15: తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పుట్టిన కాసేపటికే పసికందు మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం రేగడి మైలారం గ్రామానికి చెందిన కవిత ప్రసూతి నిమిత్తం తల్లిగారి ఊరు యాలాల మండలం దేవనూర్ గ్రామానికి వచ్చింది. ఆదివారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి మూగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు కుటుంబ సభ్యులకు చెప్పిన కొద్దిసేపటికే పసికందు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు. కాగా పసికందు పుట్టినప్పుడు బాగానే ఉన్నా, శ్వాససమస్య తలెత్తడంతోనే చనిపోయిందని ఆర్ఎంఓ అనిల్ కుమార్ తెలిపారు.

రుణమాఫీకి రేషన్ కార్డును తప్పనిసరి చేయడం దుర్మార్గం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింహారెడ్డి



రంగారెడ్డి అర్బన్, జూలై 15 : రైతుల పంట రుణమాఫీకి రేషన్ కార్డు ఉండాలని ప్రభుత్వం కండిషన్ పెట్టడం దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందన్నారు. అధికారమే లక్ష్యంగా అబద్ధ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలకులు రుణమాఫీ చేయకుండా రైతులను మరోసారి మోసం చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. రేషన్ కార్డుల పేరుతో రుణమాఫీకి తీవ్ర జాప్యం చేస్తారని మండి పడ్డారు. రైతులను గుర్తించేందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని గతంలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత మార్గదర్శకాలతో రైతులను ఇబ్బంది పెట్టడం అన్యాయం అన్నారు. రెండు లక్షలకు మించి ఉన్న రుణాన్ని రైతు బ్యాంకుకు ముందుగా చెల్లించి తర్వాత అర్హతనుబట్టి 2లక్షల రుణమాఫీ వర్తింపచేస్తామని అనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఇలాంటి విధానాలను అవలంబిస్తే ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెబుతారని, షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్

వికారాబాద్, జూలై 15: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఎన్నో ఏళ్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డదిడ్డమైన రవాణా వ్యవస్థ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కిల్ చుట్టూ వెళ్లడానికి సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో అటు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు, ఇటు తాండూరు నుంచి వచ్చే వాహనాలు, వికారాబాద్ లోపలి నుంచి వచ్చే వాహనాలు అన్నీ ఒకే రోడ్డుకు చేరుకుంటాయి. రోజురోజుకు సమస్య తీవ్రమవుతున్నా అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ పట్టణంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచే వారే లేరా? అని వాపోతున్నారు. ఇప్పటికైనా రద్దీ దృష్ట్యా చౌరస్తాలో వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలి


జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, జూలై 15: పంట పొలాల నుంచి వేస్తున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి రైతులతో కలిసి వినతిప్రతం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్మిస్తున్న బీదర్-మహేశ్వరం 765కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్, టవర్లను చేవెళ్ల, షాబాద్, కేశంపేట్, కొందుర్గు, ఫారూఖ్‌నగర్, కడ్తాల్, కందుకూర్ మండలాల మీదుగా వేస్తున్నారన్నారు. 165కిలో మీటర్ల మేర వేస్తున్న లైన్ కోసం రైతులు 3వేల ఎకరాలు కోల్పోతున్నారని చెప్పారు. భూముల విలువ ప్రస్తుతం ఎకరానికి కోటి నుంచి మూడు కోట్లు ఉందన్నారు. 2013 భూసేకరణ చట్టం ద్వారా బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర చెల్లించాలని కోరారు. పవర్ గ్రిడ్‌కార్పొరేషన్ అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం నిర్వాసి రైతులకు భూసేకరణ చట్టం, ఎలక్ట్రిసిటీ యాక్ట్‌ల ప్రకారం పరిహారం ఇవ్వాలని అధికారులకు సూచించారని గుర్తు చేశారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, జూలై 15: కడ్తాలలో ఈ నెల 17న తలపెట్టిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరిశీలించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. భవనాన్ని పరిశీలించి పనుల నిర్వహణకు కమిటీలకు బాధ్యతలు అప్పగించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఈవో సర్దార్ నాయక్, ఎంఎస్‌వో జంగయ్య, ఎస్‌వో అనితలకు సూచించారు. అనంతరం ఎంబీఏ గార్డెన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కేజీబీవీ భవన నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు కొందరు బీఆర్ఎస్ నాయకులు భవన ప్రారంభంపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. మంత్రితో కార్యక్రమం నిర్వహిస్తే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం ఆశ్చర్యం వేస్తోందని, వారు నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్/మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, బీచ్యనాయక్, నాయకులు రాములు, డాక్టర్ శ్రీనివాస్, బిక్యనాయక్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబ, యాదగిరిరెడ్డి, చందోజీ, హీరాసింగ్, శంకర్, నరేందర్, అశోక్, లక్ష్మణ్, కృష్ణ, శేఖర్‌గౌడ్, జహంగీర్‌అలీ, అశోక్, తిరుపతిరెడ్డి, ప్రభు, లక్ష్మయ్య పాల్గొన్నారు.


మల్లు రవిని సన్మానిస్తున్న మండ్లి రాములు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య

ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర

ఆమనగల్లు, జూలై 15: ప్రజావిశ్వాసాన్ని కోల్పోయి పతనమవుతున్న బీఆర్ఎస్ ఉనికి కోసం నిరుద్యోగులు, విద్యార్థులను రెచ్చగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు కుట్ర చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకొని దివాలా తీయించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ప్రేరేపిత ఉద్యమాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న ఎంపీ రవిని సోమవారం ఆమనగల్లులో కాంగ్రెస్ నాయకులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, గండికోట మల్లేశ్‌లు సత్కరించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఎంపీ మాట్లాడుతూ పదేండ్లు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఓర్వలేక కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారన్నారు. ఏటా 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన విధంగానే తాము ఇప్పటికే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇది కాగేనే మరోసారి కూడా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొప్పు రాఘవేందర్, ఇమ్రాన్‌బాబ, యాదయ్య, మానయ్య ఉన్నారు.

ఏ ప్రయోజనం కోసం కాంగ్రెస్‌లో చేరారు?

బీఆర్ఎస్ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి

శంషాబాద్, జూలై 15: ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచి ఇప్పుడు ఏ ప్రయోజనం ఆశించి కాంగ్రెస్‌లో చేరారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ప్రశ్నిస్తున్నారని, వారికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శంషాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నమ్మకంతో టికెట్ ఇచ్చి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయనకు ద్రోహం చేసి కాంగ్రెస్‌లో ఎలా కలుస్తారన్నారు. ఎంత మంది నాయకులు పార్టీ మారినా బీఆర్ఎస్‌కు ప్రజల అండదండలున్నాయన్నారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులకు రాష్ట్రంలో పుట్టగతులుండవని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కబ్జాచేసేందుకే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఆయన అనుచరులు కాంగ్రెస్‌లో చేరారని ప్రజలంతా చర్చించుకుంటున్నారని కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. ఒక్క గజం ప్రభుత్వ భూమి కూడా కబ్జా చేయనివ్వం అని, తాను ముందుండి పోరాడుతానన్నారు. భవిష్యత్తులో ప్రజల ఆశీస్సులతో కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు పునర్వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థినుల ఎంపిక

షాబాద్, జూలై 15 : ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినులు కేంద్ర విద్యా శాఖ ఇచ్చే స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్టు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాచ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర విద్యా శాఖ ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు ఇచ్చే రూ.70వేలు ఉపకార వేతనానికి ఎస్.సృజనహంసిక, ఎం.సంజన, పి.సిరి, కె.గీతాంజలి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి డిగ్రీలో యేటా రూ.10వేల చొప్పున 30వేలు, అలాగే పీజీలో రూ.20వేల చొప్పున రూ.40వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీలకు 'స్థానిక' రిజర్వేషన్లను పెంచాలి

ఇబ్రహీంపట్నం, జూలై 15: రాష్ట్రంలో బీసీ కుల గణనచేసి స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచాలని తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని మంత్రుల క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో 20 నుంచి 42శాతానికి బీసీల రిజర్వేషన్లను పెంచాలని ఆయన కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, నాయకులు గుజ్జ కృష్ణ, నంద గోపాల్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.


స్పీకర్‌కు వినతిపత్రమిస్తున్న బీసీ ఫ్రంట్ నాయకులు

పారదర్శకంగా సంక్షేమ, అభివృద్ధి
కార్యక్రమాల అమలు

కడ్తాల్, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ విధానాలతో రాష్ట్రం దివాలా తీసిందని ఆరోపించారు. కడ్తాల-తలకొండపల్లి రహదారి నుంచి వంపుగూడ, చల్లంపల్లి మీదుగా పడకల్ వరకు రూ.14.46కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు విస్తరణ పనులకు సోమవారం అధికారులు, నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రెండేళ్లలో అన్ని గ్రామాలు, తండాలకు బీటీరోడ్లు వేస్తామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసి ప్రారంభించని పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన చేపడుతామన్నారు. పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీ మూలంగా బస్సుల సంఖ్య పెంచుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15 నాటికి ఏకకాలంలో రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని కసిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ సీతారామయ్య, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఈ విజయ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, రాములు, శ్రీనివాస్, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్ బాబ, యాదగిరిరెడ్డి, చందోజీ, హీరాసింగ్, శంకర్, నరేందర్, అశోక్, లక్ష్మణ్, కృష్ణ, శేఖర్‌గౌడ్, జహంగీర్‌అలీ, అశోక్, తిరుపతిరెడ్డి, ప్రభు, లక్ష్మయ్య, మంకి శ్రీను, వెంకటేశ్, శంకర్‌నాయక్, బిక్షపతి, రామకృష్ణ,రాజేందర్, జగన్‌గౌడ్, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రాష్ట్ర విత్తన కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కందుకూరు, జులై 15: స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.అన్వేష్‌రెడ్డిని సొసైటీ డైరెక్టర్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి సోమవారం సన్మానించారు. నగరంలోని అన్వేష్‌రెడ్డి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషిచేస్తానని అన్వేష్‌రెడ్డి తెలిపినట్లు వెంకట్‌రాంరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.


అన్వేష్‌రెడ్డిని కలిసిన వెంకట్‌రాంరెడ్డి

ఎంపీ ఈటలను కలిసిన బీజేపీ నాయకులు


ఎంపీ రాజేందర్‌కు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు

కేశంపేట, జులై 15 : మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సోమవారం కేశంపేట మండల బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ నివాసంలో ఆయనను శాలువాతో సత్కరించా రు. మండలాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమలో బీజేపీ నాయకుడు సొప్పరి నరసింహ, భక్తవత్సల్, రంగు ఆంజనేయు లు, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తున్నాం

కొందుర్గు, జూలై, 15:షాద్‌నగర్ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తీర్చేందుకు కృషిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆగిర్యాల సబ్‌స్టేషన్‌లో రూ.1.02కోట్లతో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో ఓవర్‌లోడ్ సమస్య తీర్చేలా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. 9 గ్రామాల్లోని 1,200 బోర్లకు, గృహాలకు లో వోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 24గంటల ఉచిత కరెంటని అప్పులు చేసి, 13 నుంచి 14గంటల కరెంటే ఇచ్చేదన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. అనంతరం గ్రామంలో 15లక్షలతో నిర్మించే స్కిల్ డెవలప్‌మెంట్ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆగిర్యాలలో 25లక్షలతో నిర్మించే పంచాయితీ భవనానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో సీజీఎం ఆనంద్, ప్రొటెక్షన్ డీఈ భాస్కర్‌రావు, డీఈ యాదయ్య, ఏడీఈలు సరిత, మాధవరావు, ఏఈ రవికుమార్, తహసీల్దార్ రమేష్ కుమార్, ఎంఈవో కిష్టారెడ్డి, ఎంపీవో లాలయ్య, రెండుమమండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, చలివేంద్రం రాజు, నాయకులు సి.దామోదర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, సయ్యద్ సాదిక్, గోవర్ధన్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, రవి, రాజు, వజ్రమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కంకల్ రోడ్డుకు మహర్దశ

చౌదరిగూడ: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తా నుంచి కంకల్ వరకు రూ.14.7.కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదిన్నర కిలోమీటర్ల డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపడి మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉందన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, ప్యాక్స్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటనర్సింహ్మారెడ్డి, బాల్‌రాజ్, రవికుమార్, అఫ్సర్, దర్శన్, రాంచంద్రయ్య, నర్సింలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

కొందుర్గు, జూలై 15: ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పనిచేసి, ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను సోమవారం పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్ పటేల్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవంతో కూడుకున్నదని, విద్యార్థులను భావి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయలు పాత్ర కీలకమని కొనియాడారు. తన వద్ద చదువుకున్న విద్యార్థులు జీవితంలో ఎంతో ఉన్నత స్థితికి ఎదిగినా, తాను మాత్రం ఉపాధ్యాయుడిగానే మిగిలిపోయి, సమాజానికి మార్గదర్శకులుగా ఉంటారన్నారు. బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఇన్నాళ్లు తమకు సహకరించిన తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బదిలీపై అయిన వారిలో ఎ.పుష్ప, జనార్ధన్‌రెడ్డి, బాలుచంద్, అన్నపూర్ణ, రేవతి, అనిత, రజిత, వసంతలక్ష్మి, బీపీఎం.రాజు, రవీందర్, ఉదయ్‌కుమార్, జగన్‌మోహన్‌గౌడ్, ఖలీల్, రామచంద్రుడు, వెంకటయ్య ప్రకాశ్, మాధవి ఉన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం గోపీనాథ్, రిటైర్డ్ టీచర్లు గంగిరెడ్డి, సుధాకర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన ఉపాధ్యాయులతో రాజేష్ పటేల్ తదితరులు

కొత్తూర్ ఎస్ఐగా బలరాంనాయక్



కొత్తూర్: జూలై 15: కొత్తూర్ నూతన ఎస్ఐగా బలరాంనాయక్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బలరాంనాయక్ ఆమన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి, ఇటీవల కూకట్‌పల్లి పీఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి కొత్తూర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇక్కడ పనిచేసిన కె.శ్రీనివాస్ హైద్రాబాద్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన నేతలు


బెల్లయ్యనాయక్‌ను సన్మానిస్తున్న రవీందర్‌నాయక్, కృష్ణానాయక్

ఆమనగల్లు, జూలై 15: తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను సోమవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు రవీందర్‌నాయక్, కృష్ణానాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో బెల్లయ్యనాయక్‌ను సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ గిరిజన నేతలతో చైర్మన్ సమావేశమయ్యారు. 250కి పైగా తండాలు ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని కోరారు. బెల్లయ్యనాయక్‌ను కలిసిన వారిలో దశరథ్, సురేశ్‌నాయక్ ఉన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

కడ్తాల్, జూలై 15 : హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, పనులకు పొంతనేలేదన్నారు. సాలార్‌పూర్‌లో సోమవారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లయ్య కుటుంబాన్ని దశరథ్ పరామర్శించారు. జె.రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీ ప్రియరమేశ్, మాజీ ఎంపీపీ సువాళి పంతూ, పాండు, బాబ, దాస్య, కుమార్, రాజు, గోపాల్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టండి : ఎమ్మెల్యే

షాద్‌నగర్, జూలై 15: వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా వైద్యులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వ్యాధులకు గురైన వారికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉంచాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదని, వారికి అవసరమైన రక్త పరీక్షలు చేసి వాటికి సంబంధించి మందులు అంజేయాలని తెలిపారు.

పనితీరును బట్టే ప్రజల్లో గుర్తింపు

ఆమనగల్లు, జూలై 15: అంకితభావంతో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల అభిమానాన్ని చూరగొంటారని ఎస్సై బి.వెంకటేష్ అన్నారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ నుంచి కడ్తాలకు బదిలీ అయిన రఘునాయక్, సీహెచ్ శ్రీశైలంలకు సోమవారం వీడ్కోలు సన్మానం నిర్వహించారు. కానిస్టేబుళ్లను ఎస్సై వెంకటేష్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు బాల్‌రెడ్డి, యాదయ్య పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వెంకటేష్


షాద్‌నగర్ అర్బన్, జూలై 15: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంకన్నోల్ల వెంకటేష్‌ను నియమిస్తూ సోమవారం మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నియామకపత్రాన్ని ఇచ్చారు. ఎలికట్టకు చెందిన వెంకటేష్ బీజేపీ పటిష్టతకు చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి


విద్యార్థులతో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

నందిగామ, జూలై 15: నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కొత్తూర్ మాజీ ఎంపీపీ ఎం.శివ శంకర్‌గౌడ్ అన్నారు. చేగూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బంటారం మల్లేష్‌గౌడ్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు తన సొంత డబ్బులతో దుస్తులు, నోట్ బుక్కులు, ఐడీ కార్డులు, బెల్ట్, టైలు అందజేశారు. సోమవారం శివశంకర్‌గౌడ్ వాటిని అందజేశారు. మల్లేష్‌గౌడ్‌ను మాజీ ఎంపీపీ ప్రత్యేకంగా అభినందించారు.

జీవో 10ని రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇబ్రహీంపట్నం, జూలై 15: అంగన్‌వాడీ టీచర్లకు అన్యాయం తలపెట్టేలా ఉన్న జీవో 10ని వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ రిటైర్మెంట్ సమయంలో టీచర్లకు 2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరి నెల జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలన్నారు. అనంతరం సీడీపీవో శాంతిశ్రీకి వినతిపత్రమందజేశారు. ధర్నాలో అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ

ఎల్బీనగర్, జూలై 15: మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లో ఖిల్లా మైసమ్మ ఆలయంలో సోమవారం బోనాల పండుగకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తలెత్తిన ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు బాహాబాహికి దిగారు. అధికారుల తీరును నిరసిస్తు వేదిక వద్ద ఎమ్మెల్యే సబితారెడ్డి బైఠాయించారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి అధికారులు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డిని ఆహ్వానించారని సబితారెడ్డి అభ్యంతరం తెలిపారు. తాను వేదికపై ఉండనని నేలపై బైఠాయించారు. చివరకు లక్ష్మారెడ్డి, అధికారులే చెక్కులు పంపిణీ చేశారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

రికార్డు స్థాయిలో తైబజార్ వేలం

శంకర్‌పల్లి, జులై15: వేలంలో శంకర్‌పల్లి మున్సిపల్ తైబజార్ రికార్డు స్థాయిలో రేటు పలికింది. కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీన్‌కుమార్ సమక్షంలో కమిషనర్ శ్రీనివాస్ వేలం నిర్వహించారు. వేలంలో శంకర్‌పల్లికి చెందిన శోభపెంటరాజ్ రూ.15.5లక్షలకు తైబజార్ టెండర్ దక్కించుకున్నారు. వేలం దక్కించుకున్న శోభపెంటరాజ్ దంపతులను చైర్‌పర్సన్, కమిషనర్ శాలువాకప్పి అభినందించారు. అదే విధంగా చికెన్ వ్యర్థాల సేకరణకు వేలం నిర్వహించగా గౌస్ రూ.3.9లక్షలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి. మేనేజ ర్ అంజన్‌కుమార్ , సిబ్బంది జయరాజ్ తదితరులు ఉన్నారు.


శోభపెంటరాజ్ దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి


రిలే దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకుడు, కార్మికులు

కందుకూరు, జూలై 15: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, జీతాలను చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. 20ఏళ్లుగా ప్రభుత్వం పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వండి పెడుతున్న కార్మికులకు బిల్లులు, కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ మేరకు సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ప్రతీ భోజన కార్మికురాలికి నెలకు రూ.10వేల వేతనం, నిత్యావసర వస్తువుల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్, కార్యదర్శి ప్రభావతి, నాయకులు కిషన్‌జీ, లలిత, మంగ, భాగ్యలక్ష్మి, అలివేలు, శారద, శంకరమ్మ, అశ్విని, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అండర్-7 స్కేటింగ్ కాంపిటీషన్ విజేతకు అభినందన

షాబాద్, జూలై 15 : జిల్లా అండర్-7 స్కేటింగ్ కాంపిటేషన్‌లో విజయం సాధించిన నవీష్‌ను శంషాబాద్‌కు చెందిన స్కేటింగ్ కోచ్ శంకర్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో నైపుణ్యం కల్గిన పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు.



క్రీడాకారుడు నవీష్

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

కొత్తూర్, జూలై 15: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కొత్తూరులో పృథ్విస్వామి ఆధ్వర్యంలో ఎల్లమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాలను ఎత్తుకొని పెంజర్ల రోడ్డులోని మందోనిమైసమ్మ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వల్లిగ విక్రమ్, అనిల్‌చారి, దీపక్‌చారి, చరణ్, నాని, శివ, ప్రవీణ్, శ్రీను, జగదీష్ పాల్గొన్నారు.


కొత్తూర్‌లో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

కొనసాగుతున్న టీడీపీ పాదయాత్ర

చేవెళ్ల, జూలై 15 : ఏపీ సీఎం చంద్రబాబునాయుడు నాల్గో సారి సీఎం అయిన సందర్భాన్ని పురస్కరించుకొని టీడీపీ నాయకులు చేపట్టిన మహా పాదయాత్ర సోమవారం కొనసాగింది. టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కాసుల సుభాన్‌గౌడ్ మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు సీఎంగా మరోసారి సీఎం కావడం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. టీడీపీ ఆధ్వర్యంలో చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రగా వెళ్తున్నమన్నారు. రెండు రోజుల్లో శ్రీశైలానికి చేరుతాం అన్నారు. శ్రీశైల క్షేత్రంలో చంద్రబాబు కోసం పూజలు చేయిస్తామన్నారు. పాదయాత్రలో ఆయా మండలాల టీడీపీ నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొంటున్నారు.


పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు

సొసైటీల ద్వారా చేప పిల్లలు కొనుగోలు చేయాలి

ఇబ్రహీంపట్నం, జూలై 15 : టెండర్ల ద్వారా గాకుండా మత్స్యకార సొసైటీల ద్వారా చేప పిల్లలు కొనుగోలు చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో విలేకరులతో మాట్లాడారు. చేప పిల్లల పథకంలో నాణ్యమైన చేప పిల్లల కొనుగోలుకు మత్స్య సొసైటీల ఖాతాల్లో డబ్బు జమచేయాలని అన్నారు. గత ప్రభుత్వంలో చేపపిల్లలు, పంపిణీలో అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. నాణ్యమైన చేపపిల్లల కొనుగోలు సొసైటీల ద్వారానే సాధ్యమన్నారు. సమావేశంలో నాయకులు చెనమోని శంకర్, బొద్రమోని నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోరెంకల నర్సింహ

మొహర్రం వేడుకలు ప్రారంభం

ఆమనగల్లు, జూలై 15: ఈ నెల 17న మొహర్రం నేపథ్యంలో ఆమనగల్లు, మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు జరుపుకునే ఈ వేడుకలకు చావిడీల్లో పీర్లను నెలకొల్పారు. పీర్ల ఊరేగింపు, ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. మొహర్రాన్ని ఏటా కుల మతాలకతీతంగా నిర్వహిస్తారు.

సంక్షిప్తంగా...

● **షాద్‌నగర్ రూరల్:** స్వచ్ఛమైన తాగు నీటితోనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో దాత అంబటి రంజిత్‌కుమార్ తన తండ్రి బాబయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. రూ.5లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. రాజు, రవూఫ్, లింగం, జగన్ పాల్గొన్నారు.

● **యాచారం:** వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని గ్రామాల్లో లక్ష మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది నాటిన ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో 25వేల మొక్కలు నాటామన్నారు. నర్సరీల్లో ఉన్న మొక్కలు సరిపోని పక్షంలో గున్‌గల్, ఆగాపల్లి నర్సరీల నుంచి మొక్క లు తెప్పించి నాటిస్తామని చెప్పారు. ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నట్లు చెప్పారు.

● **ఆమనగల్లు:** కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాళ్ల రవీందర్ నామినేషన్ దాఖలు చేశారు. ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో బరిలో నిలిచి విజయం సాధిస్తానని రవీందర్ అన్నారు.

● **తలకొండపల్లి:** అంతర్జాతీయ బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారుడు, ప్రముఖ కోచ్ పుల్లెల గోపీచంద్‌ను టీఎస్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం, మొక్కల పెంపకం, పాఠశాలల బలోపేతానికి టీఎస్ఎస్‌వో ద్వారా చేస్తున్న కార్యక్రమాలను గోపీచంద్‌కు వివరించినట్లు లక్ష్మీనివాస్ తెలిపారు.

తలకొండపల్లి:జంగారెడ్డిపల్లికి చెందిన మహేశ్ అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్ పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3వేలు నిర్మల రూ.2వేలు అందజేశారు.

● **షాద్‌నగర్ అర్బన్:** రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అన్వేష్‌రెడ్డిని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి సన్మానించారు. ప్రమాణస్వీకారం కార్యక్రమానికి వెళ్లారు. అన్వేష్‌రెడ్డికి చైర్మన్ పదవి ఇవ్వడం సంతోషమని, రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేలా కృషి చేస్తారన్నారు.

కొవ్వొత్తులతో ఉపాధ్యాయుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు

ఆమనగల్లు, జూలై 15 : ఆకస్మికంగా మృతిచెందిన ఆమనగల్లు అరబిందో ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వర్కాల రమణారెడ్డికి ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. సోమవారం రాత్రి రమణారెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పలు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొని సంతాపం తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. ప్రైవేటు టీచర్లు మాట్లాడుతూ రమణారెడ్డి అకాల మరణం పట్టణంలోని ప్రైవేటు టీచర్లందరికీ తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కృష్ణ, ఉపాధ్యక్షుడు నరేందర్, నరేష్, శ్రీను, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులున్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

షాబాద్, జూలై 15 : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు... మక్తగూడకు చెందిన ఫిరంగి శ్రీశైలం(35) మద్యం తాగుతూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. 13న మద్యం తాగి గొడవ పడ్డాడు. సోమవారం ఉదయం పొలానికి ఎరువుల బస్తా తీసుకుపోతానని భార్య సువర్ణకు చెప్పి వెళ్లాడు. ఉదయం 11గంటలకు శ్రీశైలం సోదరుడు వెంకటేష్ వచ్చి అన్న చెట్టుకు ఉరేసుకున్నాడని చెప్పాడు. కుటుంబీకులు, గ్రామస్థులు పొలానికి చేరుకున్నారు. శ్రీశైలానికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

రెండు కార్లు ఢీ.. పలువురికి గాయాలు

చేవెళ్ల, జూలై 15: అతివేగం, అజాగ్రత్తలతో రెండు కార్లు ఎదురుఎదురుగా ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఓ కారు వికారాబాద్‌కు, మరో కారు వికారాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్నాయి. ఈ రెండు కార్లు తంగడ్‌పల్లి వద్దకురాగానే ఢీకొన్నాయి. ఒక కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ఆ కారులోని వారికి గాయాలు కాలేదు. హైదరాబాద్‌కు చెందిన కారులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు.


ఢీకొని ధ్వంసమైన కార్లు